సిమెంట్ బెంచీల వితరణ

బెంచీని అందజేస్తున్న అహ్మద్

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 20: మండలంలోని చింతలూర్ గ్రామానికి చెందిన అహ్మద్ రూ.40వేల విలువ చేసే 15 సిమెంట్ బెంచీలను గ్రామానికి గురువారం అందజేశారు. తన తండ్రి మీరాసాబ్ జ్ఞాపకార్థం వాటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అతడిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కొలిప్యాక్ సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, ఎస్.రాజేశ్వర్, ప్రదీప్, లింబాద్రి, బాలకృష్ణ, వెంకట్‌రెడ్డి, గంగాధర్, గంగారాం పాల్గొన్నారు.

ఫిర్యాదుల బాక్సు ఏర్పాటుచేయాలి

కోటగిరి, ఫిబ్రవరి 20: ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ కళాశాల, స్కూళ్లు, కస్తూర్బాలో విద్యార్థుల సౌకర్యార్థం ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ గంగాధర్ అన్నారు. కోటగిరిలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే రాసి, ఫిర్యాదు బాక్సులో వేస్తారని తెలిపారు. అంతుకుముందు మిర్జాపూర్ క్యాంప్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఇందల్వాయి, ఫిబ్రవరి 20: ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై గన్నారం గ్రామశివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందల్వాయి టోల్‌ప్లాజా సిబ్బంది ఒకరికి గాయాలయ్యాయి. పెట్రోలింగ్ వాహనంలో రోడ్డు నిర్వహణ పనులు పర్యవేక్షిస్తున్న సమయంలో కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు లోడ్‌తో వేగంగా వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో టోల్ ప్లాజా సిబ్బంది వడ్ల బ్రహ్మం గాయపడడంతో అతన్ని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు.

రేషన్ కార్డుల డాటా ఎంట్రీ ప్రారంభం

డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 20: మున్సిపల్ కార్యాలయంలో రేషన్ కార్డు డేటా ఎంట్రీ గురువారం ప్రారంభమైంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగంగా కొత్తగా రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న వారి డేటాను ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో నగర, మండల కార్యాలయంలో గ్రామీణ ప్రాంత ప్రజల డాటా ఎంట్రీ కొనసాగుతున్నది.

రావుట్లలో ఆరోగ్యమేళా

సిరికొండ, ఫిబ్రవరి 20: సిరికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని రావుట్ల గ్రామంలో గురువారం ఆరోగ్య మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పంటల క్రయవిక్రయాలను పర్యవేక్షించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- అధికారులు, వ్యాపారులతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 20: ఎర్ర, తెల్ల జొన్న, పసుపు పంటల అమ్మకాలు ప్రారంభమైనందున క్రయవిక్రయాలను అధికారులు నిశితంగా పర్యవేక్షించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. ట్రేడర్లు, సీడ్ వ్యాపారులు మార్కెట్ రేటుకు అనుగుణంగా ధరను చెల్లిస్తూ రైతుల నుంచి పంటను సేకరించేలా చూడాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు, ట్రేడర్లు విత్తన వ్యాపారులతో గురువారం సమావేశం నిర్వహించారు. రైతులు సాగు చేసిన పంటల విస్తీర్ణం, దిగుబడులు, ఎర్రజొన్న రైతులతో ఆయా కంపెనీల వ్యాపారులు కుదుర్చుకున్న ఒప్పందం, పంటలకు లభిస్తున్న ధర, మార్కెట్ డిమాండ్ తదితర విషయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బైబ్యాక్ ఒప్పందానికి కట్టుబడి తెల్లజొన్న, ఎర్రజొన్న కొనుగోళ్లు చేపట్టాలని, రైతులు బయటి మార్కెట్‌లో ఎక్కువ ధరకు ఇతర ట్రేడర్లకు పంట అమ్ముకోవాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని సీడ్ వ్యాపారులకు కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయం పాటిస్తూ విక్రయాలు సాఫీగా జరిగేలా చూడాలన్నారు. పంట విక్రయించిన రైతులకు వెంటనే డబ్బుల చెల్లింపులు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యాపారులు సిండికేట్ అయి ధర తగ్గించారనే ఫిర్యాదులు రావొద్దన్నారు. రైతులను మోసగిస్తే ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవనశాఖ సంయుక్త సంచాలకుడు శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ ఏడీ గంగవ్వ, ఏడీఏలు, ఏవోలు, పసుపు ట్రేడర్లు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక చట్టాలు, నిర్ణయాలపై గిరిరాజ్ కాలేజీలో పీడీఎస్‌యూ కాలేజీ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి నసీర్ మాట్లాడుతూ.. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం, కేంద్ర బడ్జెట్‌లో 10శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. 5,8 తరగతులకు డిటెన్షన్ విధానంతో పేద విద్యార్థులు దూరమయ్యే అవకాశం ఉన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, వాటి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వినయ, శ్రావణి, అర్చన, తనూజ, నవీన్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను సందర్శించిన పసుపు బోర్డు చైర్మన్

పంటను పరిశీలిస్తున్న పసుపు బోర్డు చైర్మన్

కంఠేశ్వర్, ఫిబ్రవరి 20: జిల్లా మార్కెట్ యార్డును పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి గురువారం సందర్శించారు. వ్యాపారులు మార్కెటింగ్ అధికారులు, మార్కెట్ కమిటీ పాలకవర్గం కుమ్మక్కై పసుపునకు సరైన ధర రాకుండా రైతులను నష్టాలకు గురి చేస్తున్నారని మంగళవారం మార్కెట్ యార్డులో పసుపు రైతులు ఆందోళన చేసిన నేపథ్యంలో పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి మార్కెట్ యార్డు సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతులు పసుపును బాగా ఎండబెట్టి తేమ లేకుండా మార్కెట్ యార్డుకు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మార్కెట్ కమిటీ సిబ్బంది ఉన్నారు.

ఒకరికొకరు పరస్పరం సహకరించుకోవాలి

ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న వక్తలు

దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 20: ఒకరికొకరు సహకరించుకొని ముందుకు సాగినప్పుడే అందరికీ సామాజిక న్యాయం సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో గురువారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు ఆకుల విశాల్, స్నేహ సొసైటీ సభ్యులు తాటి వీరేశం, బీవీ రమణారెడ్డి హాజరై మాట్లాడారు. ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉంటూ సామాజిక న్యాయం కోసం పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. అనంతరం అతిథులను స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సిబ్బంది, ఉపాధ్యాయ బృందం, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ వర్సిటీలో సేవాలాల్ జయంతి ఉత్సవాలు

వీసీకి ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 20: తెలంగాణ యూనివర్సిటీలో శుక్రవారం సేవాలాల్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు గిరిజన శక్తి టీయూ అధ్యక్షుడు శ్రీనూ రాథోడ్ గురువారం తెలిపారు. ఉత్సవాలకు సింగరేణి కాలరీస్ కంపెనీ చైర్మన్ బలరాంనాయక్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్సవాలకు రావాలని కోరుతూ టీయూ వీసీ యాదగిరిరావుకు ఆహ్వానాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైటర్ రాజూనాయక్, లక్ష్మణ్, మోహన్, సాగర్‌నాయక్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో వార్షికోత్సవం

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సిరికొండ, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలంగాణ జానపద గేయాలు, లంబాడా సంప్రదాయ వేషధారణలో నృత్యాలు చేస్తూ అందరినీ అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం రాజేశ్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈవో అశోక్

సిరికొండ, ఫిబ్రవరి 20: ఎస్సెస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని, భయాందోళనకు గురి కావొద్దని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం నిర్వహించిన విజయస్ఫూర్తి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యాశాఖ ఈ ఏడాది పరీక్షల్లో చేసిన మార్పులను విద్యార్థులకు వివరించారు. అనంతరం సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు ఉన్న సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేశారు. సులభంగా ఎలా చదువుకోవాలో సూచించారు. కార్యక్రమంలో సిరికొండ, జక్రాన్‌పల్లి ఎంఈవోలు రాములు, శ్రీనివాస్, ఎంపీవో తారాచంద్, ఉపాధ్యాయులు సతీశ్, శ్రీకాంత్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరి పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

రుద్రూర్, ఫిబ్రవరి 20: యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్)ను వ్యతిరేకించాలని కోరుతూ మార్చి 2వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న యుద్ధభేరి పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. చందూర్, మోస్రా, బోధన్, కోటగిరి, రుద్రూర్ మండలాల్లోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, చెరుకు, వరి పరిశోధన కేంద్రంలో తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కత్రి విక్రమ్ సింగ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని యుద్ధభేరిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవళ్ల గోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి రాములు, శ్రీనివాస్, రవితేజ, సంగీత, లత, సునీత, షేక్ ఈసా, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు

రెంజల్ మోడల్ స్కూల్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బాల్కొండ/ నవీపేట్/ రెంజల్, ఫిబ్రవరి 20: బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు పార్టీని ప్రిన్సిపాల్ రజీయొద్దీన్ అస్లాం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. నవీపేట్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. రెంజల్ మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో ఆంజనేయులు, ప్రిన్సిపాల్ ఫెరోజ్ అహ్మద్, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

నవీపేట్ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయొద్దు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి20: ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే చర్యలను ప్రభుత్వం విడనాడాలని 3, 4వ తరగతి ఉద్యోగులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఇన్సూరెన్స్ కార్పొరేషన్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్న భోజన సమయంలో వారు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. 3, 4వ తరగతి ఉద్యోగ నియామకాలను వెంటనే చేపట్టాలని కోరారు.

రైతులు సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేయొద్దు

నవీపేట్, ఫిబ్రవరి 20: పంట పొలాలకు వెళ్లే రైతులు విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో టెక్నికల్ డీఈ రమేశ్ సూచించారు. గురువారం మండలంలోని జన్నేపల్లి గ్రామంలో ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబాట కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. విద్యుత్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సమస్యలున్నా ట్రాన్స్‌కో సిబ్బందిని సంప్రదించాలని, నేరుగా రైతులు మరమ్మతులు చేసుకోవద్దని అన్నారు. కార్యక్రమంలో రైతులు, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రజొన్నలు, పసుపు కొనుగోలు చేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వేల్పూర్, ఫిబ్రవరి 20: ఎర్రజొన్నలు, పసుపు పంటలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వేల్పూర్‌లో డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, మిట్టపల్లి మహిపాల్, నాగధర్ విలేకరులతో మాట్లాడారు. ఎర్రజొన్నలు, పసుపు పంటలకు మద్దతు ధర కల్పిస్తామని ఎన్నికలకు ముందు రైతులకు కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని అన్నారు. ప్రభుత్వం ఎర్రజొన్నలు, పసుపు పంటలను కొనుగోలు చేయకపోవటంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించారని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు తగ్గిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించటానికి ఎంతో కృషి చేసిందన్నారు. ఇకనైనా ప్రభుత్వం పంటలకు మద్దతు ధరతో కొనుగోలు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రేగుల రాములు, సుంకరి రాము, పీట్ల సత్యం, నోముల రవీందర్, బొబ్బురు ప్రతాప్, నల్ల రమేశ్, బాలకిషన్ చిన్నారెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎడపల్లి, ఫిబ్రవరి20: ఈనెల 15న పురుగుల మందు తాగి దవాఖానలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి గురువారం మృతి చెందాడు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి కథనం ప్రకారం....జానకంపేట్‌కు చెందిన మిద్దె సాయినథ్(28) మూడు నెలల క్రితం మల్కాపూర్‌కు చెందిన యువతిని ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. మూడు నెలలు సంసారం సాఫీగా సాగింది. ఆతర్వాత సాయినథ్‌కు తన భార్య, మామలతో విబేధాలు మొదలయ్యాయి. మనస్తాపం చెందిన సాయినాథ్ ఈనెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు గమనించి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలకార్మికులను బడిలో చేర్పించాలి

బాల్కొండ, ఫిబ్రవరి 20: అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, వాటిలో పనిచేస్తున్న బాలకార్మికులను అధికారులు పాఠశాలలో చేర్పించాలని సీపీఐ డివిజన్ కమిటీ నాయకులు శ్రీను, నరేశ్, రాజేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు డిప్యూటీ తహసీల్దార్ వనజకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ మండలంలోని బస్సాపూర్, ఇత్వార్‌పేట్, శ్రీరాంసాగర్ ఆయకట్టు కింది భాగంలో కొంతమంది రైతులకు చెందిన భూములను అద్దెకు తీసుకుని ఇటుక బట్టి ఏర్పాటు చేశారని, ఆభూములకు రైతు భరోసా అందకుండా చూడాలన్నారు. ఇటుక బట్టీ యజమానులపై చర్యలు తీసుకోకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

నేడు కాలేయవ్యాధి స్క్రీనింగ్ టెస్టు శిబిరం

బోధన్, ఫిబ్రవరి 20: బోధన్ పట్టణంలో ఈనెల 21న శుక్రవారం కాలేయ వ్యాధుల నిర్ధారణ కోసం స్క్రీనింగ్ టెస్ట్ శిబిరాన్ని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ బోధన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలేయ వ్యాధులు ముదిరేవరకూ చాలా మందికి తెలియడంలేదని పేర్కొన్నారు. కాలేయ వ్యాధుల నివారణ కోసం రూ.5 వేల విలువచేసే ఫైబ్రో స్కాన్ స్క్రీనింగ్ టెస్ట్‌ను ఈ శిబిరంలో ఉచితంగా చేస్తారని తెలిపారు. పట్టణంలోని దయానంద్ గోశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ నాయకులు కోరారు.

పోలీసుల కవాతు

పోలీసుల కవాతులో పాల్గొన్న ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి20: పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ప్రజలు ప్రలోభాలకు గురి కాకుండా స్వచ్ఛందంగా ఓటును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd, Armoor Branch, Dist. Nizamabad** agreed to accord Loan to **Borrower Bhukya Santhosh** S/o. Ramchandar, Age 42 Yrs, Occ:Business, R/o.H.No.8-18, Roopla Thanda, Pedda Bheemgal (V), Bheemgal (M), Nizamabad (Dist) on mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **(7) days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE OF THE PROPERTY

The Open plot No.101 lies in Survey No.(41/1) in 13th Block Residential Purpose only, admeasuring total site area 1800.00 Sq. Fts or 200.00 Sq.Yds or 167.22 Sq.Mtrs situated at Bheemgal Village & Mandal, Nizamabad District, within the limits of Regn. Sub Dist Bheemgal, Regn.Dist. Nizamabad Municipal council: Bheemgal

Bounded as below: North: 25'-0" Wide Road, **South:** Open Plot No.81, **East:** Open Plot No. 80 & 102, **West:** Open Plot No.100

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

'ఆ వీడీసీలపై చర్యలు తీసుకోవాలి'

మోర్తాడ్, ఫిబ్రవరి 20: జిల్లాలో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న వీడీసీలపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్లూరి రాజారం అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్మూర్ మండలం చేంగల్ గ్రామంలో రజక కులస్తుల బహిష్కరణ, జక్రాన్‌పల్లి గ్రామంలో స్రవంతి అనే మహిళను బహిష్కరించి ఇంటిని కూలగొట్టడం సరికాదన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటి నాణ్యతపై అవగాహన

రెంజల్, ఫిబ్రవరి 20: నీటి నాణ్యతపై మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నీటి నాణ్యతపై ప్రజల్లో నేలకొన్న సందేహాలపై భూగర్భ జల శాఖ ఉప సంచాలకుడు శ్రీనివాస్‌బాబు మొబైల్ వాటర్ క్వాలిటీ ప్రయోగశాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్, సహాయ భౌతిక శాస్త్ర వేత్త నికత్‌ఫర్వీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి20: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో గురువారం పౌష్టికాహారం ప్రాధాన్యతపై డాక్టర్ ఫిర్దోస్ ఫాతిమా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నీరు ఎక్కువగా తాగాలని, ఆరోగ్యంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. వేసవిలో విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శాంతమ్మ, సిబ్బంది ఆనంద్, సంతోషి, చైతన్య శాంతి పాల్గొన్నారు.

శిశు, భ్రూణహత్యలు నివారించాలి

బహుమతులతో విద్యార్థులు, సీడీపీవో, ఉపాధ్యాయులు

మోర్తాడ్, ఫిబ్రవరి20: శిశు, భ్రూణహత్యలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ భీమ్‌గల్ ప్రాజెక్ట్ సీడీపీవో స్వర్ణలత అన్నారు. బేటీ బచావో.. బేటీపడావో కార్యక్రమం పదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భీమ్‌గల్ మండలం గోనుగొప్పుల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడారు. సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని, స్త్రీ లింగనిష్పత్తిని పెంచాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శారద, సౌమ్య, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు చేపట్టాలి

బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోధన్, ఫిబ్రవరి 20: హైదరాబాద్ కేంద్రంగా